క్లుప్తంగా...

నేడు మెగా రక్తదాన శిబిరం

గచ్చిబౌలి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో ఉదయం 9.30 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

'మనూ' ప్రవేశ దరఖాస్తుల గడువు ఈనెల 30 వరకు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్, మెరిట్ ఆధారిత కోర్సుల దరఖాస్తు గడువు పెంచారు. మెరిట్ ఆధారిత రెగ్యులర్ కోర్సుల కోసం దరఖాస్తు ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీని ఈనెల 30వ తేదీ వరకు పొడిగించారు. ఫారమ్ సవరణకు జూలై 31, ఆగస్టు 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అంతకుముందు చివరి తేదీ జూలై 24 వరకు అవకాశం ఉండేది. మరిన్ని వివరాలకు [illegible] కు ఈ మేయిల్ చేయండి. ఇతర ఫోన్ నం. 98668 02414, 62077 28673 సంప్రదించవచ్చు.

ఐదు లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: దివ్యాంగుల పెన్షన్‌ను పెంచుతూ సీఎం కేసీఆర్ జారీ చేసిన ఉత్తర్వులతో రాష్ట్రంలో ఐదు లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్గుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3016 నుంచి రూ. 4016 పెంచిన కేసీఆర్ దివ్యాంగులకు నిజమైన బంధావుడని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల సభా వేదికగా ఇచ్చిన హామీని నెరవేర్చారని ఆయన గుర్తు చేశారు. సంక్షేమ పథకాలలో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

దాతలు ఆదుకోండి!



చికిత్స పొందుతున్న మునేందర్

జియాగూడ: జియాగూడ మాజీ కార్పొరేటర్ మునేందర్‌కు గురువారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేరారు. ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తి ఆసుపత్రిలో బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. 2011లో జియాగూడ కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు జియాగూడ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన మునేందర్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన భార్య వినోదిని, కూతురు మౌనిక వేడుకుంటున్నారు. గుండెపోటు రావడంతో ఇతని పరిస్థితి మరింత దారుణంగా మారింది. భార్య, కూతురు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. బీజేపీ పార్టీ హైకమాండ్‌తో పాటు ఎవరైన దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ఆర్థిక సాయం చేయాలనుకునే వారు 99485 98009, 70750 82551 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కుల్సుంపురాలో ఆపరేషన్ చబుత్ర



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చబుత్రాలపై అర్ధరాత్రి వరకు కూర్చుంటున్న యువకులను పోలీస్‌స్టేషన్ తరలించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్, సంజయ్‌నగర్, కేశవస్వామినగర్, జియాగూడ తదితర ప్రాంతాల నుంచి 14 మంది యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

జియాగూడ: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ నలంద స్కూల్ ప్రాంతంలో రోడ్డు పక్కన అపస్మారకస్థితిలో పడి ఉన్న 43 ఏళ్ల వయస్సుగల ఓ గుర్తుతెలియని వ్యక్తిని పోలీసులు గుర్తించారు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

అధ్వానంగా రహదారులు

- వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నానాజీపూర్ వద్ద రోడ్డు దుస్థితి

శంషాబాద్ రూరల్: వర్షాలకు మండలంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు పడిన దారుల్లో వరదనీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం నుంచి కురుస్తున్న వర్షాలకు ఆయా మార్గాల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

- రాయన్నగూడ, ననాజీపూర్, కేబీ.దొడ్డి, పెద్దషాపూర్, తొండుపల్లి-శంకరాపురం మార్గాల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి.
- రాయన్నగూడ చౌరస్తా నుంచి కేబీ.దొడ్డి వరకు ఉన్న దారిలో అడుగడుగునా ఉన్న గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారింది.
- పెద్దషాపూర్, ననాజీపూర్ రోడ్డు పనుల్లో జాప్యం నెలకొనగా.. ఆయా మార్గాల్లో గుంతలు ఏర్పడి ఇబ్బందులు తప్పడంలేదు.

అర్థాంతరంగా నిలిచిన పనులు..

రాయన్నగూడ చౌరస్తా నుంచి కేబీ.దొడ్డి రహదారి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పనులు చేపట్టకుండా పట్టాదారులు కోర్టుకు వెళ్లడంతో రెండేళ్ల నుంచి పనులు ఆగిపోయాయి. మరోవైపు సుల్తాన్‌పల్లి-కేబీ దొడ్డి మార్గాల్లో భారీ వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి.

అధికారులు స్పందించాలి..

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ కేశవనగర్ కాలనీ, జనప్రియ, న్యూఫ్రెండ్స్ కాలనీ, సిరిమల్లె కాలనీలను కలిపే ఈసీ, మూసీ సంఘం లంగర్‌హౌజ్ వంతెన వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు, రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని పట్టించుకోవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్, రోడ్లు తదితర సమస్యలతో ప్రజలు రోడ్లపైకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రాయన్నగూడ చౌరస్తా నుంచి కేబీ.దొడ్డి వెళ్లే మార్గంలో..



రహదారి పక్కన ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



గోతులమయంగా మారిన రోడ్డు

ఆకట్టుకుంటున్న ననాజీపూర్ కత్వ



కత్వ నుంచి జలపాతాన్ని తలపిస్తున్న నీటి ప్రవాహం

శంషాబాద్ రూరల్: మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు చేరి నిండు కుండను తలపిస్తున్నాయి. ననాజీపూర్ వద్ద ఎంటీరువాగుపై ఉన్న కత్వ నుంచి పారుతున్న వరదనీరు జలపాతంలా అందరిని ఆకట్టుకుంటోంది. మూడు రోజులుగా పారుతున్న ఈ వరదను చూసేందుకు భారీగా ప్రజలు తరలివస్తున్నారు. ఇక్కడి కత్వనీళ్లలో ఈత కొట్టడం ప్రమాదకరంగా ఉన్నా యువకులు స్నానం చేసేందుకు వెనకాడటంలేదు.

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినా..

పంచాయతీ, పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి దారికి అడ్డంగా ముళ్ల కంప వేసినా జనం కత్వంపైకి ఇతర మార్గాల్లో చేరుకుంటున్నారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. ఆదివారం రాజపుష్ప వద్ద ఉన్న మోరీలలైన్‌లను మూసీలోకి మళ్లించగా.. ఆ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తాము ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ తదితరులు

విద్యార్థులను నచ్చిన రంగాల్లో ప్రోత్సహించాలి

బండ్లగూడ: విద్యార్థులకు తగిన ప్రోత్సాహకం అందిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సరస్వతీ విద్యాపీఠం శారదాదామం ప్రాంగణంలో విద్యారణ్య ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థి కృష్ణవంశిక రచించిన 'హార్ట్ ఓవర్ హెడ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ డీసీపీ అరవిందరావు, సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షుడు తిరుపతిరావు, డాక్టర్ సూర్యప్రకాష్‌లతో కలిసి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పుస్తక రచన చేసిన కృష్ణవంశికను వారు అభినందించారు. 9వ తరగతి చదువుతున్న కృష్ణవంశీకకు ఇలాంటి ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. మంచి ఆలోచనలను విద్యార్థి దశలోనే అలవర్చుకోవాలని ఆయన సూచించారు. పాఠశాల అధ్యక్షులు అర్జున్‌గౌడ్, కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, హరిస్మరణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



'హార్ట్ ఓవర్ హెడ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లింగం సుధాకర్‌రెడ్డి, తదితరులు



పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

డంపింగ్ యార్డు తొలగించాలని ధర్నా



హైదర్షాకోట్ డంపింగ్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు, కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి

బండ్లగూడ: జనావాసాల మధ్య డంపింగ్ యార్డును కొనసాగిస్తుండటంతో ప్రజలు అనేక రోగాల భారినపడుతున్నారని వెంటనే డంపింగ్ యార్డుకు తరలించాలని స్థానికులు ధర్నా చేపట్టారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లో ధర్నా చేపడుతున్న వారికి కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. నివాసాలు లేని ప్రాంతాల్లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమస్యపై అధికారులకు అనేకసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డును తొలగించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక కాలనీ, బస్తీ వాసులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో కొనసాగుతున్న విద్యార్థులు నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ 2022-23 ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం కూడా హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు నిరసన కొనసాగించారు. హెచ్‌సీయూలో అండర్ గ్రాడ్యుయేట్ , పోస్టుగాడ్యుయేట్ దరఖాస్తుల ఫీజు రద్దు చేయాలని, పీహెచ్‌డీ ఇంటర్వ్యూ కోసం విభాగాల్లో కుల ధ్రువీకరణ పత్రాల తప్పనిసరి సమర్పణను రద్దు చేయాలని, రిజిస్ట్రార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, సీఈని నియమించాలని, క్యాంపస్‌లోకి మతతత్వ శక్తులను అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు రాత్రి, పగలు తేడాల లేకుండా నిరసన కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి యూనియన్ నాయకులు

నేడు యువమోర్చా ఆధ్వర్యంలో ధర్నా

శంషాబాద్: అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ తెలిపారు. సోమవారం జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల యువ మోర్చా నేతలు పాల్గొంటారని వివరించారు.

దోమల వ్యాప్తిని అరికట్టండి



నార్సింగి పశువుల మార్కెట్ ఆవరణలో నిలిచిన మురుగు

మణికొండ: నార్సింగి పశువుల మార్కెట్ ఆవరణలో మురుగు అధికంగా ఉండటంతో దోమల వ్యాప్తి అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో పశువుల మార్కెట్ చుట్టూరా వందలాది నివాసాలు ఉన్నాయి. కాగా మార్కెట్‌లో పశువుల పేడ, మూత్రం, వరద నీరు నిలిచి దోమల వ్యాప్తికి కేంద్రంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. మార్కెటింగ్, మున్సిపల్, వైద్యశాఖల అధికారులు మార్కెట్‌లో పర్యటించి వరద నీరు నిలువకుండా నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఫలహార బండి ఊరేగింపు



రాయదుర్గం: కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో ఆదివారం బోనాల సందర్భంగా ఫలహార బండి ఊరేగింపు వైభవంగా సాగింది. అంజయ్యనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆయనతో పాటు పలువురు అతిథులను ఘనంగా సత్కరించారు. భక్తులు, బీఆర్ఎస్ నాయకులు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెయ్యి మంది ఐటీ ఉద్యోగుల రక్తదానం

రాయదుర్గం: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు జన్మదినం సందర్భంగా సోమవారం ఒకే రోజు 1000 మంది ఐటీ ఉద్యోగులు రక్తదానం చేసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్(టీఎఫ్ఎంసీ) ఆధ్వర్యంలో రాయదుర్గం మధురానగర్‌లోని దివ్యశ్రీ ఎన్ఎస్ఎల్ ఐటీ పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం టీఎఫ్ఎంసీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ, ఐటీ టవర్‌లో 10 వేల మంది పని చేస్తున్నారని, అందులో కనీసం 1000 మంది ఐటీ ఉద్యోగులు రక్తదానం చేస్తారని భావిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 'గిఫ్ట్ ఏ స్మైల్' పేరిట రెడ్‌క్రాస్ సొసైటీ సహాయం ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రసన్నకుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'



రాజేంద్రనగర్: ఎన్ఎండీసి సీజన్-2 క్రికెట్ కప్ పోటీల్లో ఎన్ఎండీసీపై బీఎస్ఎన్ఎల్ విజయం సాధించింది. శివరాంపల్లిలో నిర్వహించిన పోటీల్లో మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బీఎస్ఎన్ఎల్ టీమ్ మూడు వికెట్ల నష్టానికి 159 రన్‌లు చేసింది. క్యాప్టెన్ టి.ప్రసన్నకుమార్ 76 రన్స్, రమేష్‌రాజా 67 పరుగురు సాధించాడు. అనంతరం ఎన్ఎండీసీ 20 ఓవర్లలో 80 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. బ్యాటింగ్ చేసిన ప్రసన్నకుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అందజేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పాలు, సామగ్రీ, ట్యాంకర్లు

శంషాబాద్ రూరల్: ట్యాంకర్ నుంచి పాలను దొంగిలించి అంతే మొత్తంలో నీళ్లు కలుపుతున్న ముఠాను శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం.. కర్నూల్ నుంచి నాగపూర్ వెళ్తున్న పాల ట్యాంకర్‌ను డ్రైవర్ సాయంతో తొండుపల్లి శివారులో నిలిపారు. ఇందులో నుంచి సుమారు మూడు వేల లీటర్ల పాలను తీసి అంతే మొత్తంలో నీళ్లను కలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ముఠా సభ్యులను పట్టుకున్నారు. ట్యాంకర్ నుంచి తీసిన పాలను తరలించడానికి సిద్ధంగా ఉన్న రెండు ఆటో ట్రాలీలు, పాల క్యాన్‌లతో పాటు పాలట్యాంకర్లను సీజ్ చేశారు. ఇదిలా ఉండగా.. మేడ్చల్ వాసి శేఖర్ ఈ కల్తీ పాల దందాకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించగా.. నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. శేఖర్‌కు సహకరిస్తున్న పాల ట్యాంకర్ డ్రైవర్, నల్గొండకు చెందిన గుండాల వెంకన్న, ఆటో డ్రైవర్లు, జీడిమెట్ల వాసులు చెడిలాల్ (28), సచిన్(18)తో పాటు మరో నిందితుడు చేతన్(21)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.15 లక్షల విలువ చేసే పాలు, ఇతర సామగ్రీని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టి అటుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన పీవీ నరసింహరావు ఎక్స్‌ప్రెస్‌వేపై చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరగడంతో ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మెహిదీపట్నం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న ఓ కారు పిల్లర్ 294 వద్ద వేగంగా వచ్చి అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న రోడ్డుపై దూసుకుని ఎయిర్‌పోర్టు నుంచి మెహదీపట్నం వస్తున్న మరో కారును ఢీకొట్టగా.. ఐదుగురు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి గురైన రెండు కార్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు వివరించారు.

కుట్టు మిషన్‌ల పంపిణీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మైలార్‌దేవ్‌పల్లిలో 10 మంది మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ జహీరుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు అండగా ఉంటున్నామన్నారు. వారికి వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణతో పాటు తమకాళ్లపై తాము నిలపడేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. సొసైటీ సభ్యులు మహ్మద్ జావిద్, అఫ్జల్‌అలీ, ఫయీమ్, ముక్రంఖాన్, పాషా తదితరులున్నారు.



కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్తీపాల ముఠా అరెస్ట్

ఎస్ఓటీ దాడిలో పట్టుబడిన నిందితులు

డాక్టర్ సమరం సేవలు అమోఘం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండే సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి బంగారు పతక గ్రహీత డాక్టర్ సమరం దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. రెడ్‌క్రాస్ ద్వారా చేసిన సేవలకు గాను డాక్టర్ సమరం రాష్ట్రపతి బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు మాట్లాడుతూ, వైద్యుడిగా డాక్టర్ సమరం ప్రజలకు అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో అపర్ణ గ్రాండే సీనియర్ సిటిజన్లు త్రినాథరావు, సుబ్రహ్మణ్య శాస్త్రి, సుధాకర్‌రెడ్డి, మన్మోహన్, సందీప్ నారంగ్, కేఎస్ మూర్తి, నాగరాజారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



అపర్ణ గ్రాండేలో డాక్టర్ సమరం దంపతులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

నిరు పేదలకు అండగా ఉండేది సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే గాంధీ



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, వివేకానంద, సుధీర్ రెడ్డి

గచ్చిబౌలి: నిరు పేదలకు అండగా ఉండేది సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. జీఓ నం.58, 59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి న్యాయం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, వివేకానంద, సుధీర్‌రెడ్డిలు సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, జీఓ నం.59 కింద దరఖాస్తు చేసుకున్న కొందరికి అధిక ధరలు వస్తున్నాయని, వివాదాలలో ఉన్న స్థలాల్లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు యాజమాన్య హక్కు కల్పించాలని సీఎంకు విన్నవించారు. సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.